సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం । 2 । అక్టోబర్ । 2024



సాగర్ కాల్వలో ముగ్గురి గల్లంతు

ఖమ్మంలోని సాగర్ కాల్వలో పడి మణుగూరుకు చెందిన ముగ్గురు యువకులు గల్లంతు కాగా, ఒకరి మృతదేహం లభ్యమైంది. 10లో



పూల జాతరకు వేళాయె..

మహిళలు ఎంతో ఉత్సాహంగా ఆడుకునే బతుకమ్మ వేడుకలు బుధవారం ప్రారంభమై పదో తేదీ వరకు కొనసాగనున్నాయి. 10లో

గరిష్టం / కనిష్టం
34° / 25°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు భారీగా నమోదై, రాత్రి వాతావరణం కూడా వేడిగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయస్వామి వారికి ప్రత్యేక అభిషేకం చేశారు.

వైభవంగా రుద్రహోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకుడు, భక్తులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో మంగళవారం మాస శివరాత్రిని పురస్కరించుకుని వైభవంగా రుద్రహోమం నిర్వహించారు. ముందుగా మేళతాళాలు, వేదమంత్రాలతో అర్చకులు స్వామివారిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆ తర్వాత మండపారాధన, గణపతి పూజ, రుద్రహోమం, చివరన పూర్ణాహుతి జరిపించారు. హోమంలో పాల్గొన్న భక్త దంపతులకు అర్చకులు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వేద పండితులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచండి



రికార్డులు పరిశీలిస్తున్న డైరెక్టర్ అజయ్

పాల్వంచ : కేటీపీఎస్‌లోని పలు నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జెన్‌కో డైరెక్టర్(హెచ్‌ఆర్, సివిల్) ఎ.అజయ్ అన్నారు. మంగళవారం ఆయన కేటీపీఎస్ 5,6,7 దశల కర్మాగారం పరిధిలోని నార్త్ యాష్ పాండ్ 1, 2లను పరిశీలించారు. యాష్ పాండ్ ఎత్తు పెంచే పనులపై సీఈ పి.వెంకటేశ్వరరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎఫ్‌జీడీ ప్లాంట్, ఆక్సిజన్ ప్లాంట్, అడిషనల్ యాష్ పాండ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనుల్లో అలసత్వం వహించొద్దని, నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని సూచించారు. ఏమైనా ఆటంకాలుంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. డైరెక్టర్ వెంట ఎస్‌ఈలు యుగపతి, మోక్షవీర్ ఉన్నారు.

ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా సురేంద్రమోహన్

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యదర్శి(మైన్స్ అండ్ జియాలజీ) కె.సురేంద్రమోహన్‌ను ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ప్రత్యేకాధికారిగా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఆయన జిల్లాలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలును పర్యవేక్షించనున్నారు.

నిరుద్యోగులను మోసం చేస్తే సహించేది లేదు..

సింగరేణి(కొత్తగూడెం): ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని లేని పోని ఏజెన్సీల పేరు చెప్పి నిరుద్యోగులను మోసం చేస్తే సహించేది లేదని జిల్లా ఉపాధి కల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో ఔట్ సోర్సింగ్ కమిటీ వద్ద నమోదు కాని కొన్ని ఏజెన్సీలు ఉద్యోగాలు సృష్టించి నిరుద్యోగులను మోసం చేసి, రూ.లక్షలు దండుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వారిని గుర్తించి చర్యలు చేపడుతామని వెల్లడించారు. అలాంటి వారి సమాచారాన్ని కలెక్టర్ కార్యాలయంలో తెలపాలని సూచించారు. ప్రభుత్వ ఏజెన్సీల నుంచి ప్రకటనలు వస్తే తమ కార్యాలయంలో సంప్రదించాలని వివరించారు.

ఈ పాపం ఎవరిది?

సింగరేణిలో పెరుగుతున్న దళారుల దందా

- జూలూరుపాడు ఘటనతో మరోసారి తెరపైకి
- అవినీతికి నిలయంగా కారుణ్య నియామకాలు
- ఆరోపణలు వెల్లువెత్తితే ఉత్తుత్తి విచారణలు
- బహిర్గతం కాని నివేదికలు



ఉదాత్త లక్ష్యంతో ప్రవేశ పెట్టిన కారుణ్య నియామకాలు అవినీతి నిలయాలుగా మారాయంటూ నెత్తీ నోరు కొట్టుకుని చెప్పినా సింగరేణి యాజమాన్యం కళ్లు, చెవులు మూసుకుని ఉండిపోయింది. ఇప్పుడీ అవినీతి భూతానికి జూలూరుపాడు మండలం సాయిరాం తండాకు చెందిన రత్నకుమార్, అతని భార్య పార్వతి దంపతుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఈ పాపానికి కారకులెవరు.. కనీసం ఇప్పుడైనా కారుణ్య నియామకాలు – మెడికల్ బోర్డు పేరుతో జరుగుతున్న దందాకు సింగరేణి యాజమాన్యం చెక్ పెడుతుందా ? ఎప్పటిలాగే కంటి తుడుపు ప్రకటనతో సరిపెడుతుందా అనేది తేలాల్సి ఉంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

కారుణ్య నియామకాలకు డిమాండ్.

80వ దశకం వరకు సింగరేణిలో పని చేసేందుకు ప్రజలు అంతగా ఆసక్తి చూపించేవారు కాదు. కేవలం రన్నింగ్, జంపింగ్, గుంజీలు, బస్తాలు మోడయం వంటి ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు కల్పించేవారు. ఆ తర్వాత కాలంలో సింగరేణి కార్మికుడు రిటైర్ అయితే అతని వారసుడిగా కొడుకు లేదా అల్లుడికి ఉద్యోగం ఇచ్చే పద్ధతిని ప్రవేశపెట్టారు. అయితే ఆ తర్వాత కాలంలో సింగరేణి వారసత్వ ఉద్యోగాలు రద్దు చేసింది. దీనిపై కార్మిక సంఘాలు పట్టుబట్టడంతో అనారోగ్య కారణాలతో గనుల్లో పని చేయలేని కార్మికుల వారసులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇచ్చే పద్ధతిని 2017 – 18లో ప్రవేశపెట్టారు. మంచి వేతనం, ఉద్యోగ భద్రత, సౌకర్యాలు బాగుండటంతో కారుణ్య నియామకాలకు డిమాండ్ పెరిగింది.

విద్యావంతులను ఏమార్చి..

జూలూరుపాడుకు చెందిన రత్నకుమార్, పార్వతి దంపతులు విద్యావంతులు, కష్టజీవులు. పార్వతి బీఈడీ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతుండగా రత్నకుమార్ డిగ్రీ పూర్తి చేసి కొత్తగూడెంలోని ఓ బడామాల్‌లో పని చేస్తున్నాడు. ఇలా కష్టపడి పని చేసుకుని బతుకుతున్న వారి జీవితాల్లోకి దళారులు ప్రవేశించారు. సింగరేణిలో కారుణ్య నియామకాల ఆశలు రేపి కేవలం రెండు నెలల్లోనే రూ.16 లక్షలు కాజేశారు. చివరకు ఈ దళారీ వ్యవస్థలో కీలక వ్యక్తి చనిపోవడంతో ఆందోళనకు గురైన రత్నకుమార్ దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. సింగరేణిలో పని చేసే ఉద్యోగుల అండదండలతోనే దళారులు ఈ స్థాయిలో చెలరేగిపోయారనేది బహిరంగ రహస్యం. ఈ దళారులు, వారికి సహకరిస్తున్న కంపెనీ ఉద్యోగులను అరికట్టే విషయంలో కట్టుదిట్టమైన చర్యలు సంస్థలో కరువయ్యాయనే అభిప్రాయం మొదటి నుంచీ ఉంది.

ప్రకటనలకే పరిమితం

గడిచిన ఏడేళ్లలో కారుణ్య నియామకాల ద్వారా 15 వేల మంది ఉద్యోగులు/కార్మికులుగా చేరారు. ఈ పథకం ఆరంభించిన కొన్ని నెలలకే అవినీతి ఆరోపణలు గుప్పుమన్నాయి. ఒక్కో పోస్టుకు రూ.3 లక్షలతో మొదలైన దళారుల దందా ఇప్పుడు రూ.8 లక్షలకు చేరింది. ఈ అవినీతిని అరికట్టడంలో సింగరేణి విజిలెన్స్ విభాగం పూర్తిగా చేతులెత్తేసింది. దీంతో ఏసీబీ, సీబీడీ రంగంలోకి దిగాయి. ఆ రెండు సంస్థలు చేపట్టిన విచారణలో ఏం తేలింది, ఎవరిపై చర్యలు తీసుకున్నారనే అంశాలపై సంస్థ తరఫున ఎటువంటి వివరణ లేదు. ఇటీవల ప్రవేశ పెట్టిన వాట్సాప్, ఈ మెయిళ్లకు వచ్చిన ఫిర్యాదులు ఎన్ని, వాటిపై విచారణ జరిపి మంచీ చెడులు తేల్చిన విధానం ఏంటనే అంశంపైనా అంతా గప్‌చుప్ అన్నట్లుగా ఉన్నారు. అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు ఏసీబీ, సీబీడీ, వాట్సాప్ ఫిర్యాదులంటూ హడావిడి చేయడం తప్పితే క్షేత్రస్థాయిలో మార్పు కనిపించేలా ఎటువంటి కార్యాచరణ అమలు చేసిన పరిస్థితి సింగరేణిలో లేదనే అభిప్రాయం బలపడుతోంది. చివరకు కారుణ్య నియామకాల పేరుతో చెలరేగుతున్న దళారుల దందా కారణంగా రెండు నిండు ప్రాణాలు బలికావాల్సిన దుస్థితి దాపురించింది.

ఫిర్యాదులు ఇలా

సింగరేణికి నష్టం కలిగించే పనులు చేస్తున్న ఉద్యోగులు, ఇతరుల సమాచారాన్ని 9491144104 నంబర్ లేదా vig@ scclmines. com ద్వారా కూడా అందించే అవకాశం ఉంది.

ఆది నుంచీ ఆరోపణలే..

కారుణ్య నియామకం ద్వారా వారసులకు ఉద్యోగాలు ఆశించే కార్మికులు ముందుగా పని ప్రదేశంలో సంబంధిత సంక్షేమ అధికారికి దరఖాస్తు చేసుకోవాలి. ఇలా అన్ని ఏరియాల నుంచి వచ్చిన దరఖాస్తులతో జాబితా రూపొందించి, సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో 'మెడికల్ బోర్డు' నిర్వహించే ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షకు హాజరు కావాలి. సింగరేణిలో ఉద్యోగాలకు ఉన్న డిమాండ్‌ను ఆధారంగా చేసుకుని 'వారసుడు' గుర్తింపు కోసం నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించడం మొదలు.. మెడికల్ టెస్టుల్లో అన్‌ఫిట్ చేయిస్తామంటూ దళారులు గల్లీకొకరు వంతున బయలుదేరారు. కారుణ్య నియామకాలకు దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి 'కస్టమర్ కేర్', 'మల్టీ లెవల్ మార్కెటింగ్' తరహాలో ఫోన్లు, పరిచయస్తుల ద్వారా సంప్రదింపులు చేసే స్థాయికి చేరుకుని వ్యవస్థీకృత అవినీతి దందాగా మారిపోయింది.

100 శాతం కుటుంబ సర్వే చేయాలి

- అధికారుల మధ్య సమన్వయం ఉండాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్



విద్యార్థులు రూపొందించిన కళాకృతులను పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో అధికారులంతా సమన్వయంగా వ్యవహరించి 100 శాతం కుటుంబ సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల వివరాల సేకరణపై రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అనంతరం కలెక్టర్ పాటిల్ జిల్లా అధికారులతో సమావేశమై మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. డబుల్ బెడ్ రూంలను అర్హులకు కేటాయించాలని, ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు పాటించి రైతులకు న్యాయం చేయాలని అన్నారు.

కలెక్టరేట్‌లో వయోవృద్ధుల దినోత్సవం..

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్ల కమ్యూనిటీ హాల్ భవనానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. ఉద్యోగ విరమణ పొందినా సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమని అన్నారు. అనంతరం నేషనల్ మారథాన్ రన్నర్ యార్లగడ్డ వెంకటేశ్వర్లు, రచయిత శాగంటి కృష్ణమూర్తి, ఔషధ మొక్కల రావి వెంకటయ్య, వృద్ధాశ్రమ నిర్వాహకులను సన్మానించారు.

'ఎకోబ్రిక్స్' విజేతలకు బహుమతి ప్రదానం..

జిల్లాస్థాయిలో ఎకోబ్రిక్స్ తయారీ విజేతలకు, వ్యర్థాల నుంచి కళాకృతులు తయారుచేసిన పిల్లలకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం బహుమతులు అందజేశారు. జిల్లాలో ప్లాస్టిక్ వేస్ట్ ద్వారా ఎకోబ్రిక్స్ తయారు చేయాలనే సూచన మేరకు మొత్తం 58,581 ఎకో బ్రిక్స్‌ను తయారుచేశారు. ఎక్కువ సంఖ్యలో వినూత్నంగా ఎకో బ్రిక్స్ తయారు చేసిన 21 పంచాయతీల కార్యదర్శులకు, బూర్గంపాడు, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి మండలాల ఎంపీడీఓలకు, ఎంపీఓలకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో ప్రదర్శించిన ఎకో బ్రిక్స్, కళాకృతులను పరిశీలించారు.

విజేతలు వీరే..

పాఠశాల స్థాయిలో టేకులపల్లి మండలం సులానగర్‌కు చెందిన ఎస్ మనస్విని ప్రథమ స్థానం సాధించగా, కొత్తగూడెంలోని రామవరం జీహెచ్‌ఎస్‌కు చెందిన సాయిహరిత ద్వితీయ, చండ్రుగొండ మండలం పోకలగూడెం ఉన్నత పాఠశాలకు చెందిన బి.మధు తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నారు. జూనియర్ కళాశాలల స్థాయిలో ములకలపల్లి టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ విద్యార్థిని ఎస్ జ్యోత్స్న ప్రథమ, భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి కె.రామ్‌చరణ్ ద్వితీయ బహుమతులు సాధించారు. ఆయా కార్యక్రమాల్లో డీఆర్డీఓ విద్యాచందన, డీఎస్‌ఓ రుక్మిణి, సివిల్ డీఎం త్రినాథ్ బాబు, డీపీఓ చంద్రమౌళి, సీడీపీఓ లక్ష్మీప్రసన్న, విజయకుమారి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు కె నాగేశ్వరరావు, సీహెచ్ కృష్ణయ్య, పీఎస్‌ఎన్ రెడ్డి, కె సందీప్, జి భూషణరావు, భాస్కర్ రావు, వెస్లీ, యూసఫ్, జయరామ్, శివప్రసాద్, నాగేశ్వరరావు, రాములు, పి వరప్రసాద్, ఎ నరేష్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో సేవలు విస్తృతం చేస్తాం

పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి



సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న వీరభద్రస్వామి

చర్ల: గ్రామీణ ప్రాంతాల్లో పోస్టల్ సేవలు విస్తృతం చేస్తామని ఉమ్మడి ఖమ్మం జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తపాలా శాఖ ద్వారా అమలవుతున్న పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేలా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. డిపాజిట్లు, సేవింగ్స్ ఖాతాలు, ఇన్సూరెన్సులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతీ ఇంట్లో పోస్టల్ ఖాతా ఉండేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. ఉత్తమ సేవలందించిన ముగ్గురు సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో భద్రాచలం నార్త్ సబ్ డివిజన్ ఏఎస్పీ అశోక్‌కుమార్, చర్ల, సత్యనారాయణపురం ఎస్‌పీఎంలు పాల్గొన్నారు.

డీర్ పార్క్ నుంచి రంగాపురం వరకు కారిడార్

భద్రాద్రి జోన్ సీసీఎఫ్ భీమానాయక్



డీర్ పార్క్ స్వర్ణోత్సవ లోగోను ఆవిష్కరిస్తున్న సీసీఎఫ్, డీఎఫ్‌ఓ, అధికారులు

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసాని డీర్ పార్క్ నుంచి మర్కొడు రేంజ్ పరిధిలోని రంగాపురం వరకు 20 కి.మీ. మేర పర్యాటక కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు భద్రాద్రి జోన్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీసీఎఫ్) డి.భీమానాయక్ తెలిపారు. డీర్‌పార్కు 50వ వసంతోత్సవ వేడుకలను మంగళవారం వైల్డ్‌లైఫ్ శాఖ ఆధ్వర్యాన నిర్వహించగా సీసీఎఫ్‌తో పాటు డీఎఫ్‌ఓ కృష్ణగౌడ్ పాల్గొని వాచ్ టవర్‌ను ప్రారంభించాక, యానంబైల్ గుట్టపై ట్రెక్కింగ్ చేశారు. ఆ తర్వాత డీర్ పార్కు స్వర్ణోత్సవ లోగోను ఆవిష్కరించగా సీసీఎఫ్ మాట్లాడారు. అడవి నుంచి జింకలు గ్రామాల్లోకి వస్తే సమాచారం ఇవ్వాలని, తద్వారా వాటిని కాపాడి డీర్‌పార్క్‌లో సంరక్షిస్తామని తెలిపారు. త్వరలోనే పర్యాటకుల కోసం ఆర్‌ఓఆర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, అభయారణ్యంలో ఎకో టూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని చెప్పారు. అంతేకాక కిన్నెరసాని జలాశయంలో మరో బోట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎఫ్‌డీఓలు బి.బాబు, కట్టా దామోదర్‌రెడ్డి, రేంజర్లు కిరణ్‌కుమార్, జశ్వంత్‌ప్రసాద్, కవిత, మాధురి, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన నేటికి వాయిదా

మెయిల్, మెసేజ్ కోసం ఎదురుచూస్తున్న డీఎస్సీ అభ్యర్థులు



పాతకొత్తగూడెం పాఠశాలలో మాట్లాడుతున్న డీఈఓ

కొత్తగూడెంఅర్బన్: డీఎస్సీ – 2024లో 1:3 నిష్పత్తిలో ఎన్నికైన అభ్యర్థులకు బుధవారం నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. మంగళవారం నుంచే ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించడంతో పాతకొత్తగూడెం పాఠశాలలో పరిశీలనకు విద్యాశాఖాధికారులు సర్వం సిద్ధం చేశారు. కానీ అభ్యర్థుల సెల్‌ఫోన్‌కు, మెయిల్‌కు ఎలాంటి మెసేజ్, సమాచారం రాకపోవడంతో వారు పరిశీలన కేంద్రానికి వచ్చి వెనుదిరిగారు. అయితే మంగళవారం సాయంత్రం వరకు కూడా ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో బుధవారం నుంచి ప్రక్రియ ప్రారంభం కావచ్చునని విద్యాశాఖ అధికారులు తెలిపారు. 1:3 నిష్పత్తిలో ఎన్నికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన బుధవారం నుంచి 5వ తేదీ వరకు ఉంటుందని, ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సింగరేణి ఉన్నత పాఠశాలలో చేపడతామని వివరించారు. సెల్ ఫోన్‌కు మెసేజ్ లేదా మెయిల్ వచ్చిన వారు మాత్రమే వెరిఫికేషన్‌కు హాజరు కావాలని సూచించారు. 1:3 నిష్పత్తిలో ఎన్నికైన అభ్యర్థుల జాబితాలు అన్ని మండల విద్యాశాఖ కార్యాలయాల్లో, జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ప్రదర్శిస్తున్నామని దీని ఆధారంగా అభ్యర్థులు హాజరు కావాలని డీఈఓ సూచించారు. కాగా, ఈ డీఎస్సీలో జిల్లాలో 8,918 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించగా 477 పోస్టులు మాత్రమే ఖాళీలు ఉన్నాయి.

డిగ్రీ కాలేజీకి 'అటానమస్'

- సర్టిఫికెట్ అందజేసిన కేయూ బృందం
- ఏజెన్సీ విద్యాలయానికి అరుదైన గుర్తింపు



కళాశాలకు వచ్చిన కేయూ బృందాన్ని సత్కరిస్తున్న అధ్యాపకులు

భద్రాచలం: భద్రాచలం ఏజెన్సీలో ఎన్నో ఏళ్లుగా ఎంతోమంది విద్యావేత్తలను తీర్చిదిద్దిన ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలకు అరుదైన గుర్తింపు లభించింది. గత కొన్ని నెలలుగా చేస్తున్న ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. కాకతీయ యూనివర్సిటీకి చెందిన అటానమస్ కమిటీ సభ్యులు మంగళవారం కళాశాలను పరిశీలించారు. ఇక్కడి వసతులపై సంతృప్తి వ్యక్తం చేసిన సభ్యులు ప్రిన్సిపాల్ జాన్‌మిల్టన్‌కు అటానమస్ కన్‌ఫర్‌మెంట్ పత్రాన్ని అందజేశారు. దీంతో అటామనస్ గుర్తింపు కలిగిన కళాశాలగా భద్రాచలం రికార్డుల్లోకి ఎక్కింది. జిల్లాలో భద్రాచలంతో పాటు పాల్వంచ, ఖమ్మం జిల్లా సత్తుపల్లి, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలకు కూడా ఈ గుర్తింపు లభించింది.

ఇక అన్నీ ఇక్కడే..

కళాశాలకు అటానమస్ గుర్తింపు లభించడంతో విద్యార్థులకు పలు ఉపయోగాలు ఉంటాయని విద్యావేత్తలు అంటున్నారు. సిలబస్‌లో స్థానిక వనరులు, అవసరాలకు తగ్గట్టుగా పాఠ్యాంశాలను పొందుపర్చే అవకాశం ఉంది. పరీక్షల నిర్వహణ తేదీలు, పేపర్ల తయారీలో స్వతంత్ర నిర్ణయాధికారాలు ఉంటాయని అధ్యాపకులు చెబుతున్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు సైతం ఇక్కడే జారీ చేసే అవకాశం ఉండడంతో విద్యార్థులకు విలువైన సమయం ఆదా అవుతుంది.

మూడుసార్లు న్యాక్ గుర్తింపు..

1980లో భద్రాచలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటైంది. మొదట బీఏ, బీకాం కోర్సులు మాత్రమే ఉండేవి. 1989లో సైన్స్ విభాగాలను ప్రారంభించారు. 2006లో పీజీ కోర్సులు సైతం అందుబాటులోకి వచ్చాయి. 44 ఏళ్లుగా ఎందరో గిరిజన, గిరిజనేతర విద్యార్థులకు ఉన్నత విద్యను అందించిన ఘనత ఈ కళాశాలకు ఉంది. ఇక్కడ చదివిన వారు ఎంతో మంది ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలతో పాటుగా వ్యాపార, పారిశ్రామిక, రాజకీయ రంగాల్లోనూ రాణించారు. ప్రస్తుతం ప్రైవేట్ కళాశాలలకు దీటుగా వసతుల కల్పన, విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉత్తమంగా నిలిచిన ఈ కాలేజీకి మూడుసార్లు నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ (న్యాక్) గుర్తింపు దక్కింది. 2007లో బీ, 2016లో బీ గ్రేడ్, 2023లో బీ ప్లస్ గ్రేడ్ సాధించింది. ప్రతీ ఏట కాకతీయ యూనివర్సిటీ స్థాయిలో విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తుండడం విశేషం.

ఏజెన్సీ విద్యార్థులకు వరం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అటానమస్ గుర్తింపు లభించడం ఏజెన్సీ విద్యార్థులకు ఎంతో లాభదాయకం. యూజీసీ మూడు నెలల క్రితమే గుర్తింపు ఇచ్చినప్పటికీ మంగళవారం కేయూ బృందం పరిశీలనతో సమాప్తమైంది. ఇప్పటి నుంచే అటానమస్‌కు అనుగుణంగా కళాశాల పనిచేస్తుంది.

– కె.జాన్ మిల్టన్, ప్రిన్సిపాల్

పాల్వంచ డిగ్రీ కళాశాలకు..



అటానమస్ ఉత్తర్వులను ప్రిన్సిపాల్‌కు అందజేస్తున్న డీన్

పాల్వంచరూరల్ : పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా కల్పిస్తూ మంగళవారం కాకతీయ యూనివర్సిటీ డీన్ వి.రామచంద్రన్ ప్రిన్సిపాల్ పద్మకు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డీన్ రామచంద్రన్ మాట్లాడుతూ.. పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనతి కాలంలోనే న్యాక్ ఏ గ్రేడ్ సాధించి గతేడాది నవబంర్ 13న యూజీసీ నుంచి స్వయం ప్రతిపత్తి(అటానమస్) హోదా పొందిందని తెలిపారు. కళాశాలకు భవిష్యత్‌లో మరిన్ని కీర్తి ప్రతిష్టలు తేవాలని, అనేక విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ పద్మ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉత్తమ బోధన అందించడానికి కళాశాలలో 35 మంది అనుభవజ్ఞులైన డాక్టరేట్ కలిగిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారని తెలిపారు. అందరి సహకారంతో కళాశాలకు కీర్తిప్రతిష్టలు తీసుకొస్తామని చెప్పారు.

బతుకమ్మ సంబురాలు..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా లభించిన సందర్భంగా కళాశాల ప్రాంగణంలో బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. ఆనందోత్సాహాల నడుమ బాణసంచా పేల్చారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ మాధవి, డాక్టర్ ఎ.వెంకటేశ్వర్లు, టి.అరుణకుమారి, డి.రమేష్, వేముల కామేశ్వరరావు, కొండలరావు, శెట్టి స్వరూపారాణి, శ్రీనివాస్, రాంబాబు, ఎస్.శ్రీదేవి, దీపిక, బాబ్జి, ఖాన్, సత్యనారాయణ, ధర్మయ్య పాల్గొన్నారు.

భారీగా పెరిగిన పామాయిల్ ధర



అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌పాం సాగుదారులు చాలా ఏళ్లుగా ఎదురుచూస్తున్న టన్ను ధర ఎట్టకేలకు భారీగా పెరిగింది. అయితే ఈ సమయంలోనే గెలల దిగుబడి తగ్గడంతో రైతుల్లో కొంత నిరాశ నెలకొంది. తాజాగా ఆయిల్‌ఫెడ్ ఉన్నతాధికారులు టన్ను ముడి పామాయిల్ ధరను రూ.17,043గా ఖరారు చేసి, మంగళవారం అధికారికంగా ప్రకటించారు. దీంతో టన్ను ధర గత నెలతో పోల్చితే రూ.2651 పెరిగినట్టయింది. సెప్టెంబర్‌లో సేకరించిన గెలలకూ ఇదే ధర చెల్లిస్తామనే ప్రకటనతో గత నెలలో ఫ్యాక్టరీకి తరలించిన రైతులకు సైతం లాభం చేకూరనుంది.

పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి



భూపాలపట్నంలో పర్యటిస్తున్న కృష్ణన్ తదితరులు

పినపాక: గ్రామపంచాయతీల్లో పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని, పంచాయతీలను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని గ్రామ పంచాయతీల అదనపు కమిషనర్ కృష్ణన్ అన్నారు. మండల పరిధిలోని భూపాలపట్నంలో మంగళవారం ఆయన పర్యటించారు. పంచాయతీ అధికారులతో మాట్లాడి అభివృద్ధి పనులపై ఆరా తీశారు. గ్రామాల్లో నిత్యం పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, బ్లీచింగ్ చల్లాలని సూచించారు. దోమల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రతిరోజూ మందు పిచికారీ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

బతుకమ్మ ఘాట్ల వద్ద ఏర్పాట్లు



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ దాకూనాయక్

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచ: బతుకమ్మ సంబురాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పట్టణంలోని పలు ఘాట్‌ల వద్దకు భక్తులు వచ్చే అవకాశం ఉంది. దీంతో మున్సిపల్ అధికారులు ఏర్పాట్లలో మునిగిపోయారు. బతుకమ్మ పండుగ సంబురాల నేపథ్యంలో చెరువులు, వాగులు, దేవాలయ ప్రాంగణాల వద్ద సౌకర్యాలు కల్పించక పోవడంతో గత నెల 30వ తేదీన 'కానరాని బతుకమ్మ శోభ!' అనే శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమవగా అధికారులు స్పందించారు. పాల్వంచ మున్సిపల్ కమిషనర్ దాకూనాయక్ ఆధ్వర్యంలో చింతలచెర్వు, రాతిచెరువు వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించారు. లైటింగ్ ఏర్పాట్లు, రోడ్లకు మరమ్మతులు చేపట్టారు.

మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యుడు లొంగుబాటు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: మావోయిస్టు పార్టీకి చెందిన ఏటూరునాగారం – మహదేవపూర్ ఏరియా కమిటీ దళ సభ్యుడు ఇడమయ్య జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయాడు. మంగళవారం కొత్తగూడెంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రోహిత్‌రాజు వివరాలు వెల్లడించారు. 15 ఏళ్ల కిందట ఛత్తీస్‌గఢ్ నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం అడవిరామారాం గ్రామానికి మడకం ఇడుమయ్య వలస వచ్చాడు. వ్యవసాయ కూలీగా పనిచేసిన అనంతరం 2023లో తన సోదరుడు పూనెం ఇడమయ్యతో కలిసి టీఎస్‌సీఎం దామోదర్ సమక్షంలో మావోయిస్టుల్లో సభ్యుడిగా చేరాడు. భద్రతా బలగాలపై దాడిచేసిన పలు ఘటనల్లో పాలు పంచుకున్నాడని, కంకణాల రాజిరెడ్డికి గార్డుగా వ్యవహరించాడని ఎస్పీ వెల్లడించారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టులో చోటు



నిహాల్‌నాయక్

టేకులపల్లి: మండలంలోని కోయగూడెం ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న జర్పుల నిహాల్‌నాయక్ ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్–14 క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.అమర్‌సింగ్, వ్యాయామ ఉపాధ్యాయుడు మోతీలాల్ వివరాలు వెల్లడించారు. సోమవారం భద్రాచలంలో జరిగిన ఎంపికల్లో నిహాల్‌నాయక్ ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టుకు ఎంపికయ్యాడని, ఈ నెల 7 నుంచి గజ్వేల్‌లో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటాడని వివరించారు.

జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించాల్సిందే..



ఆందోళన నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

పాల్వంచ: రామగుండం 800 మెగావాట్ల పవర్ ప్లాంట్‌ను సింగరేణి, జెన్‌కో జాయింట్ వెంచర్‌లో నిర్మించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని, జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించాలని విద్యుత్ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక కేటీపీఎస్ 7వ దశ గేటు ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో మధుబాబు, బ్రహ్మాజీ, ఉపేందర్, రాజేందర్, మజీద్, రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, యాకూబ్, సయ్యద్, ధనయ్య, లక్ష్మి, సాహితి, శ్రావణ్‌బాబు, రవి, రఘువీర్, లక్ష్మణ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

ఇల్లెందురూరల్: సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారంపై మంగళవారం కొమరారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆగస్టులో చోటుచేసుకున్న యూరియా అక్రమ తరలింపును వెలుగులోకి తెచ్చినందుకు గాను జనగం కోటేశ్వరరావు తనపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్నాడని ఆరోపిస్తూ మండలంలోని సుభాష్‌నగర్‌కు చెందిన రమేశ్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు జనగం కోటేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు కొమరారం ఏఎస్‌ఐ తాతారావు తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై..

టేకులపల్లి: దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ పి.సురేశ్ కథనం ప్రకారం.. మండలంలోని తొమ్మిదోమైలుతండాకు చెందిన భూక్య రాములు.. భూ తగాదాల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన భూక్య సరోజ, బాణోత్ శ్రావణిని రాయితో కొట్టి గాయపరిచాడు. సరోజ కుమారుడు వినోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పూల జాతరకు వేళాయె..

■ నేటి నుంచి సంబరాలు షురూ.. ■ ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభం ■ సద్దుల బతుకమ్మతో ముగింపు

పాల్వంచరూరల్/అశ్వాపురం/కొత్తగూడెంటౌన్: పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఊరూరా బతుకమ్మ వేడుకలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆడపడుచులు పలు రకాల పూలు సేకరించి భక్తిశ్రద్ధలతో బతుకమ్మను పేరుస్తారు. సాయంత్రం వేళ నూతన వస్త్రాలు ధరించి ఆలయాలు, చెరువులు, కూడళ్ల వద్ద ఉయ్యాల పాటలు పాడుతూ బతుకమ్మ ఆడతారు. మహిళలు, యువతులు, చిన్నారుల కోలాటాలు, నృత్యాలతో సందడి నెలకొంటుంది. మహాలయ అమావాస్య రోజున ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమయ్యే వేడుకలు ఈనెల 10న సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక..

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ. ఈ పండుగ వస్తోందంటే ఎక్కడెక్కడో ఉండే ఆడపడుచులంతా పుట్టింటికి చేరుకుంటారు. గన్నేరు, తంగేడు, గునుగు, అటవి చామంతి, బంతి, నందివర్ధనం, గుమ్మడి, బీర, కట్ల పూలు, మందార, గులాబి, జాజి, రుద్రాక్ష తదితర పూలు సేకరించి బతుకమ్మలు పేరుస్తారు. గునుగుపూలు ఆకర్షణీయంగా కనిపించేందుకు రంగులు అద్దుతారు. ఎంత ఎత్తుగా బతుకమ్మ పేరిస్తే అంత సంపద సమకూరుతుందని మహిళల విశ్వాసం. దీంతో మొదటి, చివరి రోజున బతుకమ్మలను పేర్చడంలో మహిళలు పోటీ పడుతుంటారు. బతుకమ్మలను ఒక చోట చేర్చి, మధ్యలో గౌరమ్మను ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. పాటలు పాడుతూ, కోలాటాలు ఆడిన తర్వాత నీటిలో నిమజ్జనం చేస్తారు. కొన్ని ప్రాంతాల్లో బతుకమ్మ పండుగకు తొమ్మిది రోజుల ముందు బొడ్డెమ్మ పండుగ కూడా చేస్తారు.



బతుకమ్మ ఆడుతున్న మహిళలు (ఫైల్)

పువ్వు పువ్వుకో ప్రత్యేకత..

బతుకమ్మను పేర్చే పూలలో ప్రతీ పువ్వుకో ప్రత్యేకత ఉంది. తంగేడు పువ్వు..పసుపు రంగుతో సకల శుభాలకు సూచిక. గోరింట పూలు ప్రేమానురాగాలకు ప్రతీక. గునుగుపూలు శాంతికి చిహ్నంగా నిలుస్తాయి. బంతి, చామంతి, తామర, కట్ల, గడ్డి పూలు సప్త వర్ణాలు కలిగి ఉంటాయి. ఇలా మహిళలు రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలు పేరుస్తారు.

పండుగ కోసం ఎదురుచూస్తుంటాం



బతుకమ్మ పండుగ వచ్చిందంటే ఎంతో ఆనందంగా ఉంటుంది. ఈ పండుగ ఎప్పుడొస్తుందా అని ప్రతీ సంవత్సరం ఎదురు చూస్తున్నా. ఈ తొమ్మిది రోజులు ఆటపాటలతో ఆనందోత్సాహాలతో గడుపుతాం. ఈ పండుగ వల్ల మహిళల్లో స్నేహభావం బలపడుతుంది.

– శ్రీదేవి, పాల్వంచ

చిన్నప్పటి నుంచీ ఆడుతున్నా



బతుకమ్మ పండుగ అంటే నాకు చిన్నప్పటి నుంచీ ఎంతో ఇష్టం. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి తోబుట్టువులు, స్నేహితులతో కలిసి ఆనందోత్సాహాలతో ఆడుకుంటాం. ప్రతీ సంవత్సరం బతుకమ్మ జరుపుకునే ఈ బతుకమ్మ పండుగ అంటే ఎనలేని ఇష్టం.

– దివ్య, లక్ష్మీదేవిపల్లి

రోజుకో నైవేద్యం..

మహాలయ అమావాస్య రోజు బతుకమ్మ పండుగ ప్రారంభం అవుతుంది. మొదటిరోజు ఎంగిలి పూల బతుకమ్మ అంటారు. ఈ రోజు నువ్వులు, బియ్యం పిండితో చేసిన ముద్దలను గౌరీదేవికి నైవేద్యంగా సమర్పిస్తారు.

గౌరమ్మను పూజిస్తే సౌభాగ్యం



తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ. ఆడపడుచులు తొమ్మిది రోజుల పాటు సంతోషంగా బతుకమ్మ ఆడుతారు. బతుకమ్మ పండుగలో గౌరమ్మను పూజిస్తే మహిళలకు సౌభాగ్యం కలిగి, సుఖ సంతోషాలతో ఉంటారని నమ్మకం. తొమ్మిది రోజుల పాటు రోజుకో నైవేద్యం పెడతాం. ఈ పండుగ మహిళల్లో ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపుతుంది.

– ముత్తినేని సుజాత, మాజీ ఎంపీపీ, అశ్వాపురం

పూల సేకరణపై దృష్టి



బతుకమ్మ పండగ తొమ్మిది రోజుల పాటు వివిధ రకాల పూల సేకరణ కోసం శ్రమిస్తాం. ఎన్ని ఎక్కువ పూలను సేకరిస్తే బతుకమ్మ అంత పెద్దగా ఉంటుంది. ముఖ్యంగా మొదటి, చివరి రోజుల్లో రకరకాల పూలు సేకరించి మూడు, నాలుగు గంటలపాటు బతుకమ్మను పెద్దదిగా పేర్చడంలో పోటీ పడుతాం. బతుకమ్మ కోసం ఎంత ఖర్చయినా భరిస్తాం.

– సీహెచ్.సృజిత, పాల్వంచ

అటుకుల బతుకమ్మ..

రెండో రోజు అటుకుల బతుకమ్మగా పిలుస్తారు. సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో నైవేద్యం సమర్పిస్తారు.

ముద్దపప్పు బతుకమ్మ..

మూడు రోజు బతుకమ్మను ముద్ద పప్పు బతుకమ్మ అంటారు. ముద్ద పప్పు, పాలు, బెల్లంతో నైవేద్యం అందజేస్తారు.

నాన బియ్యం బతుకమ్మ..

నాలుగో రోజు నాన బియ్యం బతుకమ్మగా పిలుస్తారు. నానబెట్టిన బియ్యం, నువ్వులు, పాలు, బెల్లం కలిపి నైవేద్యంగా సమర్పిస్తారు.

అట్ల బతుకమ్మ..

ఐదో రోజు బతుకమ్మను అట్ల బతుకమ్మ అంటారు. అట్లను నైవేద్యంగా సమర్పిస్తారు.

అలిగిన బతుకమ్మ..

ఆరో రోజు వేడుకను అలిగిన బతుకమ్మగా పిలుస్తారు. ఈరోజు ఎలాంటి నైవేద్యం చేయరు.

వేపకాయల బతుకమ్మ..

ఏడో రోజును వేపకాయల బతుకమ్మ అంటారు. బియ్యం పిండితో వేపపండ్లలా తయారు చేసి నైవేద్యం సమర్పిస్తారు.

వెన్నముద్దల బతుకమ్మ..

ఎనిమిదో రోజు బతుకమ్మను వెన్నముద్దల బతుకమ్మగా పిలుస్తారు. నువ్వులు, నెయ్యి, బెల్లం కలిపి గౌరీ దేవికి నైవేద్యంగా సమర్పిస్తారు.

సద్దుల బతుకమ్మ..

తొమ్మిదో రోజు దుర్గాష్టమి నాడు సద్దుల బతుకమ్మ వేడుకను నిర్వహిస్తారు. ఈరోజు పలు రకాల నైవేద్యాలు సమర్పించి బతుకమ్మను సాగనంపుతారు.

మూలమలుపు.. ఆపై అతివేగం

- భాగ్యనగర్ తండాలో ఘోర రోడ్డు ప్రమాదం
- రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురు మృతి
- మరొకరి పరిస్థితి విషమం
- మృతుల్లో దంపతులు, శ్రీకాకుళం వాసి



సూర్యనారాయణ – సుగుణ (ఫైల్)



నక్క వెంకటేష్ (ఫైల్)

కారేపల్లి/ఇల్లెందు: మరో ఐదు నిమిషాలైతే ఇంటికి చేరుకోవాల్సిన దంపతులు రోడ్డు ప్రమాదంలో కన్నుమూశారు. మరణం కూడా వారి బంధాన్ని విడదీయలేకపోయింది. అయితే, వీరి మృతితో కుమారుడు, కుమార్తె అనాథలుగా మారారు. మరోవైపు వివాహ నిశ్చితార్థం పూర్తయి వచ్చే వేసవిలో వివాహానికి సిద్ధమవుతున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన యువకుడు సైతం ఇదే ప్రమాదంలో మృతి చెందాడు. మరో వ్యక్తి తీవ్రగాయాలపాలై చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. కారేపల్లి మండలం భాగ్యనగర్ తండాలోని ఇల్లెందు – కారేపల్లి ప్రధాన రహదారిలోని బొడ్రాసికుంట ఆంజనేయస్వామి గుడి ఎదుట మంగళవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి.

కర్మకాండలకు వెళ్లొస్తుండగా..

మండలంలోని గుట్టకిందిగుంపు గ్రామానికి చెందిన దంపతులు ఉండం సూర్యనారాయణ (50) – సుగుణ(45) ఇల్లెందు మండలం మామిడిగుండాలలోని తమ బంధువుల ఇంట్లో కర్మకు బైక్‌పై వెళ్లి వస్తున్నారు. ఇంకా రెండు కిలోమీటర్లు ప్రయాణిస్తే వారు స్వస్థలానికి చేరుకునేవారు. అయితే, భాగ్యనగర్‌తండా బొడ్రాసికుంట చెరువు, హనుమాన్ గుడి వద్ద మూలమలుపు వద్దకు రాగానే ఉసిరికాయలపల్లి సోలార్ ప్లాంట్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఏపీలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన నక్క వెంకటేష్(32), ఆలియాతండాకు చెందిన కాంట్రాక్ట్ వర్కర్ ధరావత్ రాజు మరో బైక్‌పై కారేపల్లి నుంచి ఇల్లెందు వైపు అతివేగంగా వెళ్లేక్రమాన ఢీకొన్నారు. ఈ ఘటనలో సూర్యనారాయణ – సుగుణతో పాటు వెంకటేష్ తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందారు. ఇక రాజు తలకు తీవ్రగాయాలు కాగా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.



ఇల్లెందు ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుల బంధువులు



ఘటనా స్థలిలో పరిశీలిస్తున్న సీఐ తిరుపతిరెడ్డి, ఎస్‌ఐ రాజారాం

ఫిబ్రవరిలో వెంకటేష్ పెళ్లి..

శ్రీకాకుళానికి చెందిన వెంకటేష్ సోలార్ ప్లాంట్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు ఇటీవల నిశ్చితార్థం కాగా ఫిబ్రవరిలో వివాహానికి ముహూర్తం నిర్ణయించినట్లు తెలిసింది. ప్లాంట్‌లో పనిచేసే కాంట్రాక్ట్ వర్కర్ రాజుతో కలిసి ఆయన కోట మైసమ్మ ఆలయం వద్ద మరో స్నేహితుడు చేసిన వేడుకకు వెళ్లాడు. తిరిగి వచ్చే క్రమాన ప్రమాదం బారిన పడ్డారు.

మరణంలోనూ వీడని బంధం

గుట్టకిందిగుంపు గ్రామానికి చెందిన సూర్యనారాయణ సుతారి మేస్త్రీగా, సుగుణ వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె నల్లగొండలో బీఈడీ చేస్తుండగా, కుమారుడు జ్ఞానేశ్వర్ ఇంటర్ పూర్తి చేశాడు. అన్యోన్యంగా సాగుతున్న వీరి బంధాన్ని మృత్యువు కబళించింది. 'అమ్మానాన్నా.. హన్మంతుడు కూడా మీ ప్రాణాలకు అడ్డు పడలేదా' అంటూ జ్ఞానేశ్వర్ రోదిస్తుండడం స్థానికులను కంటతడి పెట్టించింది.

మూలమలుపే యమపాశం

భాగ్యనగర్ తండాలో బొడ్రాసికుంట చెరువు వద్ద రోడ్డును ఆనుకుని శ్రీఆంజనేయస్వామి ఆలయం సమీపాన మూలమలుపు ఉంటుంది. గతంలోనూ ఇక్కడ పలు ప్రమాదాలు జరిగాయి. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు మూలమలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయించారు. అయితే ద్విచక్ర వాహనదారులు స్పీడ్ బ్రేకర్ల వద్దకు వచ్చాక వేగం నియంత్రించలేకపోవడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. మరోపక్క వెంకటేష్, రాజు బైక్‌లో మద్యం బాటిల్ ఉండడంతో వారు అప్పటికే మద్యం సేవించి ఉంటారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ఘటనాస్థలిని సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్‌ఐ ఎన్.రాజారాం పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

ఆస్పత్రిలో ఆర్తనాదాలు

కారేపల్లి మండలం భాగ్యనగర్ తండాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కన్నుమూసిన ముగ్గురి మృతదేహాలను ఇల్లెందు ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఈ మేరకు సమాచారం అందుకున్న వారి బంధువులు, కుటుంబీకులు చేరుకోవడంతో ఆర్తనాదాలు మిన్నంటాయి. ఇక తీవ్రంగా గాయపడిన రాజుకు డాక్టర్ బన్సీలాల్ ప్రాథమిక చికిత్స చేశాక ఖమ్మం తరలించారు.

సాగర్ కాల్వలో ముగ్గురి గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం.. మిగతా వారి కోసం గాలింపు
- జైలులో ఉన్న మిత్రుడిని చూసి వెళ్తుండగా ప్రమాదం
- కన్నీరు మున్నీరవుతున్న బాధిత కుటుంబీకులు







చల్లా రమేశ్, బండారు భరత్‌కుమార్, కట్టా ప్రసాద్(ఫైల్)

ఖమ్మంఅర్బన్/మణుగూరుటౌన్: ఖమ్మంలోని సాగర్ కాల్వలో పడి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. జైలులో ఉన్న తమ స్నేహితుడిని చూసి వెళ్లే క్రమాన స్నానం కోసం కాల్వలోకి దిగగా ఈ ప్రమాదం జరిగింది. ఖమ్మం సమీపాన దానవాయిగూడెం వద్ద సోమవారం ఈ ఘటన చోటుచేసుకోగా మంగళవారం ఉదయం వెలుగుచూసింది.

ఆటోలో వచ్చి వెళ్తూ..

మణుగూరు మండలం శివలింగాపురానికి చెందిన లారీ డ్రైవర్ చల్లా రమేశ్, ఆటోడ్రైవర్ బండారు భరత్‌కుమార్‌తో పాటు బాపనకుంటకు చెందిన వెంకన్న, కట్టా ప్రసాద్ ఆటోలో సోమవారం ఉదయం ఖమ్మం వచ్చారు. ఇక్కడి జైలులో ఉన్న చల్లా రమేశ్ బంధువు, మిగతా వారికి స్నేహితుడైన వ్యక్తికి బెయిల్ ఇచ్చేందుకు రాగా అది వాయిదా పడింది. దీంతో ఆయనను జైలులో కలిసిన అనంతరం నలుగురు తిరిగి ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యలో దానవాయిగూడెంలో నివాసముండే రమేశ్ అన్న కుమారుడి ఇంటికి వెళ్లారు. అక్కడ అంతా కలిసి మద్యం సేవించాక తిరిగి వెళ్లే క్రమాన దానవాయిగూడెం సాగర్ కెనాల్ వద్ద ఆగారు. కెనాల్‌పైకి వెళ్లాలని నిర్ణయించుకోగా వెంకన్న నిరాకరించి ఆటోలోనే పడుకున్నాడు. మిగిలిన ముగ్గురు మెట్ల మార్గం ద్వారా సాగర్ కెనాల్ కట్టపైకి చేరుకున్నారు. అక్కడ స్నానం చేసే క్రమాన ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు.



భరత్‌కుమార్ మృతదేహాన్ని తరలిస్తున్న అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు, తదితరులు

ఉదయం లేచే సరికి..

ఆటోలోనే నిద్రించిన వెంకన్న మంగళవారం ఉదయం మెలకువ వచ్చాక చూసేసరికి మిత్రులు కానరాలేదు. దీంతో కెనాల్ వైపు వెళ్లగా అక్కడ గట్టుపై దుస్తులు ఉండడంతో ఆందోళన చెందిన ఆయన వారి కుటుంబీకులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు ఖానాపురం హవేలీ సీఐ భానుప్రకాశ్ ఆధ్వర్యాన పోలీసులు హుటాహుటిన చేరుకుని గాలింపు చేపట్టగా మధ్యాహ్నం సమయాన బండారు భరత్ కుమార్ (30) మృతదేహం లభ్యమైంది. దీంతో అన్నం సేవా ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావు బృందం మృతదేహాన్ని బయటకు తీసి ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇక చల్లా రమేశ్, కట్టా ప్రసాద్ కోసం రాత్రి పొద్దుపోయే వరకు నగర ఏసీపీ రమణమూర్తి ఆధ్వర్యాన గాలింపు కొనసాగింది. కాగా, ఈ ఘటనతో మణుగూరు శివలింగాపురం, బాపనకుంటలో విషాద చాయలు అలుముకున్నాయి.

అత్తవారింటి ఎదుట కోడలు ఆందోళన

బూర్గంపాడు: తన భర్త, అత్తింటివారు వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ ఓ వివాహిత మంగళవారం వారి ఇంటి ఎదుట ఆందోళన చేపట్టింది. సారపాకకు చెందిన కామేశ్వరరావుకు గుంటూరు జిల్లా పిడుగురాళ్ల పట్టణానికి చెందిన లక్ష్మీపార్వతికి 2013లో వివాహం జరిగింది. వీరికి పిల్లలు కలగకపోవటంతో లక్ష్మీపార్వతిపై వేధింపులు మొదలయ్యాయి. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు కూడా నడిచాయి. అయినా అత్తింటి వారి నుంచి తనకు వేధింపులు తప్పటం లేదని మంగళవారం లక్ష్మీపార్వతి ఆందోళనకు దిగింది. ఆమెకు మహిళా సంఘాలు మద్దతుగా నిలిచాయి. మహిళా సంఘాల ఆధ్వర్యంలో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.



ఆందోళన చేస్తున్న వివాహిత

పేకాట స్థావరంపై దాడి

రూ.2,300 నగదు స్వాధీనం

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని పెంట్లం గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,300 నగదు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చంద్రశేఖర్ వెల్లడించారు.

గిరిజన కళాశాల విద్యార్థినులకు ఎంబీబీఎస్ సీట్లు

భద్రాచలం: భద్రాచలంలోని గిరిజన సంక్షేమ శాఖ గురుకుల బాలికల కళాశాల పూర్వ విద్యార్థులు పలువురు ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో సీట్లు సాధించారు. భద్రాచలంలోని గిరిజన గురుకుల కళాశాల (సీఓఈ)లో కొన్నేళ్లుగా జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్ శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ 2023–24లో ఇంటర్ పూర్తిచేసిన వి.వీరకుమారి మహబూబ్‌నగర్, కె.చైతన్య, పి.గీతాంజలి గద్వాల ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో, కె.సాత్విక హైదరాబాద్‌లోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కాలేజీ, అమృతవాణి హైదరాబాద్‌లోని మహేశ్వర్ పీవీటీ మెడికల్ కాలేజీలో సీట్లు సాధించగా భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్, గురుకులాల ఆర్‌సీఓ కె.నాగార్జున్‌రావు, ప్రిన్సిపాల్ పద్మావతి అభినందించారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని గొల్లగూడెంకు చెందిన వివాహిత మోడెపు పావని(30) గతనెల 30న ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోగా మంగళవారం కేసు నమోదైంది. ఆమెకు 13ఏళ్ల క్రితం భద్రాద్రి జిల్లా గరీయిపేటకు చెందిన గురుమూర్తితో వివాహం జరగగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే గురుమూర్తికి తొమ్మిదేళ్ల క్రితం పక్షవాతం రావడంతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి ఏడాదిగా పావని పుట్టింట్లో ఉంటోంది. కూలీ పనులు చేసుకుంటే పిల్లలను పోషిస్తుండగా భర్త అనారోగ్యం, పిల్లల పోషణ భారం కావడంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై ఆమె తండ్రి భీమయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ ముష్కు రాజు తెలిపారు.

మోసపోయిన దంపతుల ఆత్మహత్య

- పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడిన భార్యాభర్తలు
- ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి
- సాయిరాంతండాలో విషాద చాయలు

జూలూరుపాడు: సింగరేణి ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఓ దళారి చెప్పిన మాయమాటలు నమ్మి మోసపోయామనే మనస్తాపంతో దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జూలూరుపాడు మండలం సాయిరాంతండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సాయిరాం తండాకు చెందిన హళావత్ రత్నకుమార్(30), పార్వతి(28) దంపతులు కొంతకాలంగా కొత్తగూడెంలో ఉంటున్నారు. రత్నకుమార్ ఓ షాపింగ్ మాల్‌లో పని చేస్తుండగా అక్కడ సహోద్యోగితో పరిచయమైంది. తన మిత్రుడికి రూ.16 లక్షలు ఇస్తే సింగరేణిలో మంచి ఉద్యోగం ఇప్పిస్తాడని సహోద్యోగి చెప్పగా రత్నకుమార్ నమ్మి ఆ మొత్తాన్ని ఇచ్చాడు. నాలుగు నెలలు గడిచినా ఉద్యోగం రాకపోగా, డబ్బు చెల్లించిన వ్యక్తికి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోంది. సహోద్యోగి సైతం కొన్ని రోజులుగా డ్యూటీకి రావడం లేదు. ఈ క్రమంలో తాను కట్టిన డబ్బులు తిరిగి వస్తాయో రావో అనే ఆందోళనతో రత్నకుమార్ సోమవారం కలుపు మందు తాగాడు. గమనించిన భార్య పార్వతి కూడా అదే మందు తాగగా ఇద్దరి పరిస్థితి విషమించింది. దీంతో కుటుంబసభ్యులు హైదరాబాద్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి ఇద్దరూ మృతిచెందారు. కాగా, పార్వతి పుట్టిల్లు కూడా సాయిరాంతండానే కావడంతో ఇద్దరూ చిన్నప్పటి నుంచే కలిసి మెలిసి తిరిగేవారు. 2016లో వీరి వివాహం జరగగా, ఇంకా సంతానం కలగలేదు. ఎప్పుడూ అన్యోన్యంగా ఉండే దంపతులు మృత్యువులోనూ బంధం వీడలేదు. ఇరు కుటుంబాల వారి రోదనలతో తండాలో విషాదం అలుముకుంది. మృతదేహాలకు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు చుంచుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.



పార్వతి, రత్నకుమార్ దంపతులు (ఫైల్)

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ములకలపల్లి: పంటచేనుకు పురుగులమందు స్ప్రే చేయడంతో అనారోగ్యానికి గురైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కమలాపురం గ్రామానికి చెందిన బైటి రాంబాబు (26) గత నెల 13 తేదీన గ్రామానికి చెందిన ఓ రైతు చేనులో పురుగుమందు పిచికారీ చేశాడు. ఆ మందు నోరు, ముక్కులోకి పోవడంతో ఆరోజు రాత్రి రాంబాబుకు విరేచనాలయ్యాయి. వెంటనే ఆయన్ను కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. గత నెల 21న ఖమ్మం తరలించగా.. పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య వెంకటరమణ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

పాముకాటుతో యువకుడు..

ములకలపల్లి: పాముకాటుకు గురై యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అశ్వాపురం మండలానికి చెందిన పూనెం నాగేంద్ర కుమారుడు పూనెం తరుణ్ (23) కొమ్ముగూడెంలోని పూనెం వెంకటేష్ ఇంట్లో ఉంటూ అటవీశాఖలో ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తరుణ్ రోజులాగానే సోమవారం ఇంట్లో నేలపై నిద్రించాడు. మంగళవారం తెల్లవారుజామున అనారోగ్యానికి గురై వాంతులు కావడంతో, హుటాహుటిన పాల్వంచ ఆస్పత్రికి.. అక్కడి నుంచి కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పాము కరిచినట్లు గుర్తించి.. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తల్లి నాగేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.



తరుణ్ (ఫైల్)

సాక్షి క్లాసిఫైడ్స్



■ ఒమేగా హోమ్‌కేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావాలి. ఫ్రీ ఫుడ్ వసతి. జీ: 18K. ఫోన్: 8977639662 [SCA-24000291]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	9010299957, 9705444182
కొత్తగూడెం	9010223783
పాల్వంచ	9705444183
భద్రాచలం	9951602914
మణుగూరు	9705944416
సత్తుపల్లి	9652868642
మధిర	9949927792

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
(GST 5% అదనం)